

చిల్లర దోపిడీ..!

- చేయూత పింఛన్లలో పోస్టల్ సిబ్బంది చేతివాటం
- ఆసరా పింఛన్ల పైన వచ్చే రూ.16 నొక్కేస్తున్న వైనం
- రెండు సంవత్సరాలుగా అదే తంతు
- అడిగినవారిని బెదిరిస్తున్న సిబ్బంది

7



మల్లన్న పెండ్లి కొడుకాయెనే..

- నేడే కొమురవెల్లి మల్లికార్జునస్వామి కల్యాణం
- తోటబావివద్ద ఏర్పాట్లుపూర్తి
- తరలివస్తున్న భక్తులు
- మూడు నెలల బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

7

సంగారెడ్డికి మన్మోహన్‌సింగ్ మేలు చేశారు

- ఎద్దుమైలారం ఓడీఎఫ్ ఫ్యాక్టరీకి మన్మోహన్ వల్లనే వర్క్‌లోడ్ మంజూరు
- 2012-13లో అప్పటి ఎంపీ రేణుకాచౌదరితో కలిసి వినతిపత్రం ఇవ్వగానే స్పందించారు
- ఆయన కృషితోనే వేలాది మందికి ఉపాధి అవకాశాలు
- సంగారెడ్డి నియోజకవర్గ ప్రజల తరపున నివాళులు
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి

సంగారెడ్డి, డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చొరవతో సంగారెడ్డి నియోజకవర్గంలోని ఎద్దుమైలారంలో ఏర్పాటుచేసిన ఓడీఎఫ్ ఫ్యాక్టరీకి మాజీ ప్రధానమంత్రి, మన్మోహన్‌సింగ్ ఎంతో మేలు చేశారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఓడీఎఫ్ ఫ్యాక్టరీకి సంబంధించిన వర్క్‌లోడ్‌ను తమిళనాడులోని జబల్పూర్‌కు తరలించాలన్న ప్రతిపాదన వచ్చిన నేపథ్యంలో 2012-13 సంవత్సరంలో అప్పటి రాజ్యసభ ఎంపీగా ఉన్న రేణుకాచౌదరితో కలిసి తాను మన్మోహన్‌ను కలిశానని గుర్తుచేసుకున్నారు. ఎద్దుమైలారంలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీకే వర్క్‌లోడ్ మంజూరు చేయాలని తాను వినతిపత్రం ఇచ్చిన వెంటనే స్పందించారని చెప్పారు. మన్మోహన్ నిర్ణయం వల్లనే నేడు ఉమ్మడి మెదక్ జిల్లాలోని వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కాయని వివరించారు. సంగారెడ్డి నియోజకవర్గ ప్రజల తరఫున మన్మోహన్‌కు నివాళులర్పిస్తున్నానని జగ్గారెడ్డి సంతాపం ప్రకటించారు.



ఎద్దుమైలారం ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ వర్క్ లోడ్ గురించి 2012-13లో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ హోదాలో కలిసిన జగ్గారెడ్డి (ఫైల్)

పార్టీ లేదా..

- డిసెంబరు 31 దావత్ కోసం యువత ప్రత్యేక ప్రణాళిక
- ఫాంహౌస్‌లకు డిమాండ్
- ఏర్పాట్ల కోసం వాట్సాప్ గ్రూపులు
- 'స్థానిక' ఆశావహుల విందు రాజకీయాలు
- హద్దుమీరితే కేసులు తప్పవంటున్న పోలీసులు

పార్టీ లేదా.. ఇది ఓ సినిమాలో డైలాగ్.. కాకపోతే ప్రస్తుతం యువత మనసులో మాట కూడా ఇదే! డిసెంబర్ 31 వస్తుండడంతో దావత్ ఎక్కడ చేసుకోవాలా అని సిద్ధమవుతున్నారు. న్యూఇయర్ పార్టీ సాదాసీదాగా చేస్తే మజా ఏముంటుంది.. ఏడాదంతా గుర్తుండేలా ఎంజాయ్ చేయాలని ఆలోచించి ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలను ఆశ్రయిస్తున్నారు. ఇందుకు రిసార్టులు, ఫంక్షన్‌హాళ్లు వేదికలవుతున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలు, మ్యూజికల్ నైట్లతో అదరగొట్టేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఈ హడావుడి అంతా పట్టణాల్లోనే కాదు.. పల్లెల్లోనూ జరుగుతుండడం విశేషం.



మెదక్ కల్చరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గతంలో న్యూఇయర్ పార్టీ అంటే స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లోనో.. డాబాల పైనో చేసుకునేవారు. కానీ ఇప్పుడు పార్టీ గుర్తుండి పోయేలా జరుపుకోవాలి, ఎంజాయ్ చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. సందట్లో సడేమియా అన్నట్టు రాజకీయ నాయకులు కూడా యువతను ఆకట్టుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఇలా ఎవరికివారు దావత్ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. కొందరు యువకులైతే ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూప్‌లు క్రియేట్ చేసుకుని పార్టీలో ఏ బ్రాండ్ మందు తెచ్చుకోవాలి, మటన్, చికెన్, ఫిష్, ప్రాన్స్ ఇలా ఎన్నిరకాల వంటకాలు చేయాలి, డీజే పెట్టాలా ఖర్చు ఎంత అవుతుంది అని చర్చించుకుంటున్నారు. ఫ్యామిలీ మెంబర్స్‌తో పార్టీ నిర్వహించుకోవాలనుకునేవారు ఫామ్‌హౌస్‌ల వైపు మొగ్గు చూపుతున్నారు.

ఫామ్‌హౌస్‌ల ధరలకు రెక్కలు

న్యూఇయర్ సందర్భంగా ఫామ్‌హౌస్‌ల ధరలకు రెక్కలు వచ్చాయి. జిల్లాలో చేగుంట, నర్సాపూర్, తూప్రాన్, మేడ్చల్ పరిసరాల్లో ఫామ్‌హౌస్‌లు ఎక్కువగా ఉన్నాయి. మామూలు సమయాల్లో ఫాంహౌస్‌కు రోజుకు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు చెల్లించేవారు. ప్రస్తుతం డిమాండ్ ఎక్కువగా ఉండటంతో రోజుకు రూ. 10వేల నుంచి రూ.20వేల వరకు డిమాండ్ చేస్తున్నారు. కుటుంబ సభ్యులతో దావత్ చేసుకోవాలనుకునేవారు ధర ఎక్కువైనా ఫామ్‌హౌస్‌ల వైపు మొగ్గు చూపుతున్నారు. పోలీసుల ఆంక్షలు తప్పించుకోవడానికి, డ్రంకెన్‌డ్రైవ్ ఇబ్బంది తప్పించుకోవడానికి కూడా మొగ్గుచూపుతున్నారు. స్నేహితులు, కుటుంబ సభ్యులతో జరపుకునేవారు ఇలా ప్లాన్ చేసుకుంటున్నారు. డీజే సౌండ్స్, పటాకుల మోత మోగించడానికి సిద్ధమవుతున్నారు. అర్ధరాత్రి కేక్‌కోసి శుభాకాంక్షలు చెప్పుకోవడానికి సిద్ధమవుతున్నారు.

స్థానిక ఎన్నికలపై ఆశలతో..

జనవరి లేదా ఫిబ్రవరిలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్న తరుణంలో ఎన్నికల్లో నిలబడాలనుకునే అభ్యర్థులు ఈ అవకాశాన్ని ఒడిసిపట్టుకోవడానికి సిద్ధమావుతున్నారు. డిసెంబరు 31 దావత్ మంచి అవకాశంగా భావించి తమ అనుకూల వర్గాలు అభిమానులతో ఘనంగా దావత్ ఏర్పాటు చేయాలని ప్రణాళికలు సిద్ధం చేటున్నారు.

పార్టీకి పోలీస్ నిబంధనలు ఇవే...

- పోలీసుల అనుమతి లేకుండా న్యూఇయర్ వేడుకలు నిర్వహించకూడదు.
- డీజేలకు అనుమతి లేదు. 45 డెసిబెల్స్ సౌండ్ మించకుండా ఉండే శబ్ద పరికరాలు మాత్రమే వాడాలి.
- అసభ్యకరమైన డాన్సులకు అనుమతి లేదు.
- బహిరంగ ప్రదేశాలు, రోడ్లపై మద్యం సేవించరాదు.
- ఇరుగు, పొరుగు వారిని ఇబ్బంది కలిగించేలా వ్యవహరించకూడదు.
- కపుల్స్ కోసం నిర్వహించే పార్టీలలో మైనర్లకు అర్హత లేదు.
- దావత్‌లో మత్తుపదార్థాలకు అనుమతి లేదు.



వర్షాలకు నీట మునిగిన పత్తి పంట (ఫైల్)

కన్నీటి సాగు

కలిసిరాని కాలంతో అన్నదాతలకు నష్టం

ఈ ఏడాది పంటల సాగుకు కాలం కలిసిరాక పోవడంతో రైతులకు కన్నీరే మిగిలింది. యాసంగి కోతల వేళ ప్రకృతి వైపరీత్యంతో పంటలు నీట మునిగి నష్టం వాటిల్లగా.. వానాకాలం సీజన్ మొదట్లో వర్షాలు కురియక పోగా.. అదును దాటాక భారీ వానలు విరుచుకుపడడంతో పంటల దిగుబడిపై ప్రభావం చూపింది. ధాన్యం అమ్ముకునేందుకు నానా కష్టాలు పడ్డారు. ఖరీఫ్‌లో కాంటాలు ఆలస్యమవడంతో ఎక్కువ శాతం ధాన్యం దళారుల పాలైంది. ఈ ఏడాది రైతు రుణమాఫీతో రెండు లక్షల లోపు రుణం కలిగిన కొంతమంది రైతులకు మాత్రం ఊరట లభించింది.

- మూడు సీజన్‌లుగా రైతులకు అందని రైతు భరోసా
- అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలు, తగ్గిన దిగుబడి
- అందరికీ అందని రుణమాఫీ

సంగారెడ్డి టౌన్/మెదక్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : 2024 సంవత్సరం వ్యవసాయం రంగం అనేక ఒడిదొడుకులను ఎదుర్కొన్నది. అన్నదాతలకు అంతగా కలిసిరాక ఆగమయ్యారు. వానాలకాలం సీజన్‌లో ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో భారీ వర్షాలు కురియడంతో వేలాది ఎకరాల పంటలు నీట మునిగి దెబ్బతిన్నాయి. దాంతో దిగుబడి తగ్గింది. సంగారెడ్డి జిల్లాలో వానాకాలంలో అకాల వర్షాల వల్ల 3,288 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఫలితంగా 2,881 మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు. అత్యధికంగా 1,198 ఎకరాల్లో పత్తి, 888 ఎకరాల్లో కంది, 554 సోయాబీన్, 300 ఎకరాల్లో పెసర పంటలు దెబ్బతిన్నాయి. అయితే 3288 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలను గుర్తించిన ప్రభుత్వం ఎకరాకు రూ.10వేల చొప్పున 2881 మంది రైతులకు మొత్తం రూ.3.28కోట్ల పరిహారాన్ని అందజేశారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా వడగండ్ల వానలకు 951.68 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. 1279 మంది రైతులకు రూ.95 లక్షల 27 వేలు పరిహారం చెల్లించినా కోల్పోయిన నష్టాన్ని పూడ్చలేకపోయిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ధాన్యం దళారుల పాలు

ధాన్యం చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలు కురియడంతో

మిగతా 8వ పేజీలో..

దివ్యాంగులకు ప్రత్యేక ప్రజావాణి

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు ప్రతీ నెల మొదటి శనివారం ప్రత్యేక ప్రజావాణి నిర్వహించనున్నట్టు సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో అధికారులతో శనివారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సదరన్ క్యాంపులో తలెత్తే సమస్యలపై అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జ్యోతిలను ఆదేశించారు. దివ్యాంగులు సదరం ధ్రువపత్రాలు పొందేందుకు, రెన్యూవల్ చేసుకునేందుకు పోన్‌చేసి సమాచారం అందించాలని సూచించారు. సదరం క్యాంపులో స్లాట్ బుకింగ్ కోసం మొబైల్ యాప్‌లో సిటిజన్స్ స్లాట్ బుకింగ్ సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. శనివారం, సోమవారం ప్రజావాణికి వచ్చే దివ్యాంగుల కోసం వీల్‌చైర్లు ఏర్పాటు చేయాలని, బ్యాటరీ ఆటో ట్రాలీని అందుబాటులో ఉంచాలని సంక్షేమ శాఖాధికారులను కలెక్టర్ క్రాంతి ఆదేశించారు. జిల్లాలో వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ ఎస్టీ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

రాత్రి 12 గంటలకే దాబాలు బంద్

- సంగారెడ్డి జిల్లాపై స్పెషల్ ఫోకస్
- మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ





ఆయుధాన్ని పరిశీలిస్తున్న ఐజీ సత్యనారాయణ


సంగారెడ్డి క్రైం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలోని 65వ నంబరు జాతీయ రహదారిపై ఉన్న దాబాలన్నీ రాత్రి 12 గంటలకే మూత పడాలని, లేకుంటే కేసులు తప్పవని మల్టీజోన్-2 ఐజీ వి.సత్యనారాయణ హెచ్చరించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ జిల్లాలో మద్యం దుకాణాలు, బార్లు నిర్ణీత సమయంలోపే మూసివేయాలని ఆదేశించారు. అలాగే రెస్టారెంట్లు, దాబాలు రాత్రి 12 గంటలోపే మూతపడాలని, లేకుంటే కేసులు నమోదు చేయక తప్పదన్నారు. అర్ధరాత్రి తర్వాత కూడా దాబాలు నడుస్తుండటంతో ప్రమాదాలతో పాటు క్రైమ్‌రేట్ పెరిగే అవకాశం ఉందన్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ తర్వాత సంగారెడ్డినే ఎక్కువ రియల్ ఎస్టేట్ జరుగుతుందని, దీంతో రౌడీయిజం వంటివి ఎక్కువయ్యే ప్రమాదం ఉందని, ఆయా ప్రాంతాలపై పోలీసు శాఖ ప్రత్యేక నజర్ పెడుతుందని చెప్పారు. ఎవరైనా అమాయక ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. కంది మండలంలో ఇసుక అక్రమ తయారీ, అక్రమ రవాణా వంటివి చేస్తున్నట్టు తమ శాఖ దృష్టికి వచ్చిందని, వారిపై కొరడా ఝుళిపిస్తామని అన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాలు, మట్కా, పేకాట వంటి వాటిపై ఉక్కుపాదం మోపుతున్నామని తెలిపారు. జిల్లాలో పోలీసుల పనితీరు చాలా బాగుందని ఐజీ ప్రశంసించారు. జిల్లాకు 430 మంది కొత్తగా పోలీసులు వచ్చారని, ఇందులో 120 మంది మహిళా పోలీసులే ఉన్నారని చెప్పారు. ఆయన వెంట జిల్లా ఎస్పీ రూపేష్ ఉన్నారు.

రేపు కొండపోచమ్మ ఆలయ వద్ద వేలం పాట

జగదేవ్‌పూర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలం తిగుల్ నర్సాపూర్ గ్రామ సమీపంలో శ్రీ కొండపోచమ్మ ఆలయం వద్ద సోమవారం బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రవికుమార్ తెలిపారు. ఈ నెల 20న వేలం పాట నిర్వహించామని, కానీ, ఇంకా కొన్నింటి వేలంపాట జరగలేదన్నారు. 2 షెట్టర్‌లు, లడ్డు, పులిహోర, కూరగాయలు, డెకరేషన్, పాలు, పెరుగు తదితరాలకు సోమవారం వేలంపాట వేయనున్నామని తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు ముందుగానే డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.













మక్కల సాగుకు మొగ్గు..

- సాగునీరు లేక వరికి బదులుగా..
- ఎకరాకు 40 క్వింటాళ్ల దిగుమతి
- బహిరంగ మార్కెట్‌లోనే ధర ఎక్కువ
- పెట్టుబడి.. కూలీల అవసరమూ తక్కువే



అక్కన్నపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వరి సాగు చేస్తే చివరి దశలో నీరు అందక పంట ఎండి పోయే పరిస్థితులు ఉండడంతో రైతులు మొక్కజొన్న సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్‌లో అధిక ధర పలకడం, పంటకు అందించే నీరు, కూలీల అవసరం తక్కువగా ఉండడంతో రైతులు వరికి బదులుగా మక్కల సాగుకు మొగ్గు చూపుతున్నారు. సిద్దిపేట జిల్లావ్యాప్తంగా 23 వేల ఎకరాల్లో మక్కలు సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. హుస్నాబాద్ డివిజన్ పరిధిలోని అక్కన్నపేట, కోహెడ, హుస్నాబాద్, బెజ్జంకి మండలాల్లో అధికంగా నల్లరేగడి, ఎర్ర చెక్క నేలలు ఉండటంతో రైతులు మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఈ యాసంగి సీజన్‌లో హుస్నాబాద్ డివిజన్‌లో ఇప్పటి వరకు 8,750 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారు. సాగు ఇంకా పెరిగే అవకాశం ఉందని చెపుతున్నారు. ఇతర పంటలతో పోలిస్తే మొక్కజొన్నకు కూలీల అవసరం, పెట్టుబడి తక్కువగా ఉండటంతో రైతులు దీని వైపు మొగ్గు చూపుతున్నారు. పత్తి పంటలకు వైరస్, చీడపీడలు ఆశించి రైతులకు తీవ్రంగా నష్టాలు రావడంతో మొక్క జొన్న సాగు చేసేందుకు ప్రస్తుతం రైతులు ఆసక్తి చూపుతున్నారు. మొక్కజొన్న పంట సాగు చేస్తే ఎకరాకు 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం ప్రభుత్వం క్వింటాలకు రూ. 2,225 మద్దతు ధర ఉంది. కానీ బహిరంగ మార్కెట్‌లో ఇతర ప్రైవేటు వ్యాపారులు గింజ నాణ్యతను బట్టి రూ. 2,300 నుంచి రూ. 2,400వరకు కొనుగోలు చేశారు. మొక్కజొన్న గింజలకు డిమాండ్ భారీగా ఉండటంతో ప్రస్తుత పరిస్థితుల్లో ఈ ఏడాది కూడా మొక్కజొన్న సాగుకు రైతులు మక్కువ చూపిస్తున్నారు.

రెండు ఎకరాల్లో సాగు చేస్తున్నా..



నీరు ఎక్కువగా లేకపోవడంతో వరికి బదులుగా రెండు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాను. తక్కువగా నీరున్న మొక్కజొన్న పంటకు సరిపోతుంది. కూలీల అవసరం, పెట్టుబడి కూడా తక్కువగా ఉండటంతో మొక్కజొన్న వేశాను. దిగుబడి కూడా ఎకరానికి 40 క్వింటాళ్ల వరకు వస్తుంది.

- పొన్న కరుణాకర్, రైతు, రామవరం

పెరగనున్న సాగు



బహిరంగ మార్కెట్‌లో మొక్కజొన్నకు ప్రభుత్వ మద్దతు ధర కంటే ధర ఎక్కువగా ఉండడంతో రైతులు మొక్కజొన్న సాగు పై ఆసక్తి చూపిస్తున్నారు. గత సీజన్ కంటే ఈ సీజన్‌లో మొక్కజొన్న విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. జీరో ట్రిల్లేజ్ పద్ధతిలో చాలా మంది రైతులు మొక్కజొన్న సాగు చేస్తున్నారు.

-బి. శ్రీనివాస్, డివిజన్ వ్యవసాయాధికారి, హుస్నాబాద్

రోడ్డు ప్రమాదాల నివారణకు
చర్యలు చేపట్టండి

- సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో పోలీస్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి, అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించడంలో ఆర్‌అండ్‌బీ, పోలీసు, స్థానిక సంస్థల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. హెల్మెట్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రమాద ప్రదేశాల్లో సూచిక బోర్డులు, రహదారి భద్రతా సూచనలు తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగితే సమయానికి అంబులెన్స్ అందుబాటులో ఉండేలా చూడాలని, 108 సిబ్బందికి ప్రత్యేక శిక్షణనివ్వాలన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారులను శుభ్రంగా ఉంచాలని, చెత్తను రహదారుల పక్కన వేయకుండా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఈఈ రాంబాబు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చెట్లు నరికిన వ్యక్తిపై కేసు



బైరాన్‌పల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో నరికివేసిన టేకుచెట్లు...

ధూళిమిట్ట,డిసెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బైరాన్‌పల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో అనుమతి లేకుండా టేకుచెట్లను నరికివేసిన గ్రామానికి చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాముడు శనివారం తెలిపారు. అనుమతి లేకుండా చెట్లను నరికివేయడం చట్టరీత్యా నేరమన్నారు. కలప స్వాధీనం చేసుకున్నామనీ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు. ఇదే విషయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని వివరణ కోరగా సమాచారం ఇవ్వకుండానే చెట్లను నరికివేసినట్లు తెలిపారు.

ఆస్పత్రిలో శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమేనని ఆందోళన

పేట్‌బషీరాబాద్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్లక్ష్యంతోనే శిశువు చనిపోయిందని బంధువులు, కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మెదక్ జిల్లా, తుప్రాన్ మండలం మనోరాబాద్‌కు చెందిన ప్రభాకర్ భార్య జ్యోతిక ఈ నెల 25న కొంపల్లి మున్సిపల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి పురిటి నొప్పులతో వచ్చింది. అక్కడి వైద్యులు, నర్సులు పట్టించుకోకపోవడంతో ఆస్పత్రి ఆవరణలోనే ప్రసవించి బేబీకి జన్మనిచ్చింది. శిశువు పరిస్థితి సీరియస్‌గా ఉండంతో కుటుంబ సభ్యులు మరో పిల్లల ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ శనివారం శిశువు మృతి చెందింది. దీంతో కుటుంబసభ్యులు, బంధువులు నర్సులు సరిగా వైద్యం చేయక పోవడం, వైద్యుల నిర్లక్ష్య కారణంగానే మా బేబి చనిపోయిందంటూ ఆ ఆస్పత్రి ఎదుట శనివారం ఆందోళనకు దిగారు. ఈవిషయం పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఆస్పత్రి యాజమాన్యం ఫిర్యాదు చేయగా, ఘటన స్థలానికి చేరుకొన్న పోలీసులు ఆందోళన చేస్తున్న వారికి నచ్చజెప్పారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. మృతి చెందిన శిశువు కుటుంబానికి ఆస్పత్రి యాజమాన్యం ఒప్పందం కుదుర్చుకున్నట్టుగా తెలుస్తుంది.



మాట్లాడుతున్న ఇంటర్ జిల్లా నోడల్ అధికారి మాధవి

భావితరాలకు మార్గ నిర్దేశం కావాలి

- టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్

మెదక్ అర్బన్, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): నూతన కార్యవర్గం భావితరాల ఉద్యోగులకు మార్గనిర్దేశం కావాలని టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ పేర్కొన్నారు. శనివారం బాలుర జూనియర్ కళాశాలలో టీఎన్జీవోస్ బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫ్ ఉద్యోగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విధి నిర్వహణలో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో నిపుణులచే శిక్షణా తరగతులు ఏర్పాటు చేస్తామన్నారు. అంతకుముందు ఇంటర్ జిల్లా ఇన్‌చార్జి నోడల్ అధికారి మాధవి మాట్లాడారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఫోరం జిల్లా అధ్యక్షుడిగా సాయికుమార్, కార్యదర్శిగా అక్బర్, అసోసియేట్ అధ్యక్షుడిగా శివప్రసాద్, కోశాధికారి హైమద్ ఉమర్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, అరుంధతిని ఎన్నుకున్నారు.

వీఎస్టీ కార్మిక సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం



కాళ్లకల్ వీఎస్టీ పరిశ్రమ వద్ద కార్మికుల సంబరాలు

మనోహరాబాద్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ మండలం కాళ్లకల్ పారిశ్రామికవాడలోని వీఎస్టీ(వజీర్ సుల్తాన్ టుబాకో లిమిటెడ్) పరిశ్రమలో శనివారం కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, బీజేపీ నుంచి కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిలో బరిలో నిల్చున్నారు. పరిశ్రమలో మొత్తం 386 మంది కార్మికులు ఉన్నారు. ఇందులో 382 మంది పోలింగ్‌లో పాల్గొన్నారు. అయితే శ్రీనివాస్‌రెడ్డికి 115, కాటిపల్లి వెంకటరమణారెడ్డికి 95, సంజీవరెడ్డికి 172 ఓట్లు వచ్చాయి. దీంతో బీఆర్‌ఎస్ అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డిపై సంజీవరెడ్డి 57 ఓట్లతో గెలుపొందారు. అనంతరం కార్మికులు పరిశ్రమ వద్ద ర్యాలీ నిర్వహించారు. ఇందులో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్, వైస్ సెక్రటరీ విజయ్‌కుమార్‌యాదవ్, కార్మికులు రాజయ్య, లీడ్ పాల్, శ్రీనివాస్‌యాదవ్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు వల వేయడం రావాలి



రాందాసుగూడలో స్కిల్ టెస్టుకు సిద్ధంగా ఉన్న మత్స్యకారులు

చిలప్‌చెడ్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు చేపలు పట్టడం, వల వేయడం లాంటి స్కిల్స్ తప్పకుండా రావాలని మత్స్య సహకార సంఘం ఏడీ మల్లేశం పేర్కొన్నారు. శనివారం మండలం పరిధిలోని రాందాసుగూడలో ఏడీ మల్లేశం ఆధ్వర్యంలో మత్స్య సహకార సభ్యత్వం కోసం స్కిల్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి వలల అల్లిక, వల విసరడం తదితర టెస్ట్‌లను నిర్వహించారు. జిల్లా మత్స్య సహకార సంఘం డైరెక్టర్ గాండ్ల కృష్ణ, ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య

మెదక్ కల్చరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెదక్ మండలం జానకంపల్లి గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం జానకంపల్లికి చెందిన దివిటి మల్లయ్య కుమార్తె (17) కేజీబీవీ పాఠశాలలో పదో తరగతి చదువుతుంది. బోనాల పండుగ ఉండడంతో ఈ నెల 22న గ్రామానికి వచ్చిన శ్రావణి శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనా స్థలంలో తన చావుకు తన తల్లిదండ్రులే కారణమని రాసి ఉన్న లేఖ లభించింది. అయితే మల్లయ్య మొదటి భార్య ఇందిర పదేళ్ల క్రితమే మరణించగా, జ్యోతిని రెండో వివాహం చేసుకున్నాడు. మొదటి భార్యకు ముగ్గురు కూతుర్లు. ఇద్దరి వివాహం చేయగా చిన్న కూతురు శ్రావణి. తమ చెల్లెలి మృతికి తండ్రి మల్లయ్య తో పాటు, జ్యోతిలే కారణమని శ్రావణి అక్కలు మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మాట్లాడుతున్న సీడీపీవో అంజమ్మ

ఉత్సాహంగా అంగన్‌వాడీ టీచర్ల మేళా

జహీరాబాద్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్ఎల్లార్ పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించిన అంగన్‌వాడీ మేళా టీచర్ల ఆటపాటలతో ఉత్సాహంగా జరిగింది. అజీమ్‌ప్రేమ్‌జీ ఫౌండేషన్, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లకు విద్యా బోధనపై అవగాహన కల్పించారు. చిన్నారులకు ఆటపాటల ద్వారా ఎలా నేర్పించాలో శిక్షణ ఇచ్చారు. భాషా-తమాషా, అక్షరసవాళ్లు, భలే భలే భావనలు, లెక్కిద్దాం రారండి, అంకెలగారడీ, గీతలు-వ్రాతలు, గణిత నైపుణ్యాలు, తదితరాలపై వివరించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీవో అంజమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో 3-6 ఏళ్ల చిన్నారులు ఉంటారని, వారికి ఆటపాటలతో బోధిస్తేనే తొందరగా అర్థమవుతుందన్నారు. అందుకోసమే ఈ శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అజీమ్‌ప్రేమ్‌జీ ఫౌండేషన్, ఐసీడీఎస్ అధికారులు అనితకుమారి, తులసమ్మ, సద్గుణ, రాధమ్మ, నీరజాగ్రేష్, విజయలక్ష్మి, కోటేశ్వరరావు, వెంకటరమణ, వెంకటసాయి, కవిత, సుజాత, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి హామీ నిలబెట్టుకోవాలి

● మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సూచించారు. సంగారెడ్డికి విచ్చేసిన ఆయనకు శనివారం సమగ్ర శిక్షా ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎంపీ తెలిపారు. సమ్మె 22వ రోజుకు చేరిన సందర్భంగా ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు మరెల్లి దత్తు మాట్లాడుతూ తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలన్నారు. డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు.

మల్లన్న పెండ్లి కొడుకాయెనే..

● నేడే కొమురవెల్లి మల్లికార్జునస్వామి కల్యాణం
● తోటబావి వద్ద ఏర్పాట్లు పూర్తి
● శోభాయమానంగా ఆలయ పరిసరాలు
● తరలివస్తున్న భక్తులు
● బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



చేర్యాల, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కోరమీసాల కొమురవెల్లి మల్లికార్జునస్వామి పెండ్లికొడుకయ్యాడు. వెండిసింహాసనంపై వీరశైవుల ఆడబిడ్డ అయిన మేడలాదేవీ, యాదవుల ఆడబిడ్డ అయిన కేతలాదేవీని వివాహమాడేందుకు సంసిద్ధమయ్యాడు. మార్గశిర మాసం చివరి ఆదివారాన్ని పురస్కరించుకుని నేడు మల్లన్న ఆలయ తోటబావి ప్రాంగణంలో వీర శైవాగమశాస్త్రం ప్రకారం స్వామివారి కల్యాణాన్ని నిర్వహించనున్నారు. ఈ ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు ఎదురుచూస్తున్నారు. ఇందుకు ఆలయవర్గాలు, ప్రభుత్వశాఖల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. తోటబావి ప్రాంగణాన్ని గ్యాలరీలుగా విభజించి షామియానా, అరటిచెట్లు, మామిడితోరణాలు, గ్రీన్ మ్యాట్‌లతో సర్వాంగా సుందరంగా తీర్చిదిద్దారు. కల్యాణవేదికను రకరకాల పూలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణం నుంచి తోటబావి ప్రాంగణం వరకు ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఏర్పాట్లు చేపట్టారు. మల్లన్న కల్యాణానికి ప్రభుత్వం తరఫున రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టువస్త్రాలు, తలంబ్రాలు అందించనున్నారు. కల్యాణాన్ని తిలకించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40వేల మంది భక్తులు హాజరుకానుండటంతో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. అలాగే భక్తుల రద్ధీకి అనుగుణంగా లడ్డూ, పులిహోర ప్రసాదం సిద్ధంగా ఉంచారు.

నేటి నుంచి మల్లన్న గర్భాలయ దర్శనం

మూలవిరాట్టు అలంకరణ నిమిత్తం ఆరురోజుల క్రితం నిలిపివేసిన గర్భాలయ ప్రవేశం, దర్శనం నేటి నుంచి పునః ప్రారంభం కానుంది. ఆదివారం తెల్లవారుజామున ముఖమండపంలోని భైరవ విగ్రహం ఎదుట బలిహరణ జరిపి దృష్టికుంభం నిర్వహించనున్నారు. గుమ్మడికాయను బలిచ్చి స్వామివారికి మూడవ నేత్రమైన చిత్రకన్నును అమరుస్తారు. అనంతరం విశేష పూజలు నిర్వహించి కల్యాణ వేడుకలను ప్రారంభించనున్నారు. తోటబావి వద్ద ఉత్సవవిగ్రహాలతో కల్యాణం నిర్వహిస్తున్న క్రమంలో గర్భాలయంలోనూ మల్లన్నకు శాస్త్రోక్తయుక్తంగా కల్యాణం జరుపుతారు.

రతీబియ్యం సేకరణ.

దృష్టికుంభం నిర్వహణకు శనివారం రాత్రి గ్రామంలో వీరశైవార్చకులు వీరభద్రుడి పల్లెరాన్ని చేతపట్టుకుని అర్చకుల ఇళ్లలోనుంచి రతీబియ్యాన్ని సేకరించారు. అనంతరం గ్రామంలోని అన్నికుల సంఘాలతో పాటు గ్రామస్థులు భక్తిప్రపత్తులతో బియ్యాన్ని అందించారు.

రీల్స్ చూడొద్దు... చాటింగ్ చేయవద్దు....: హుస్నాబాద్ ఏసీపీ సతీశ్

కల్యాణ బందోబస్తు విధుల నిర్వహణపై శనివారం ఏఆర్ అడిషనల్ డీసీపీ రామచంద్రారావు, హుస్నాబాద్ ఏసీపీ సతీశ్ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా స్థానిక తోటబావి వేదిక ఆవరణలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విధుల నిర్వహణ పట్ల అప్రమత్తంగా ఉండాలని, సంయమనం పాటించి భక్తుల మనోభావాలకు భంగం కలిగించకుండా వ్యవహరించాలని సూచించారు. రీల్స్ చూడవద్దని, వాట్సప్ చాటింగ్‌చేయవద్దని తెలిపారు. 75 సీసీ కెమెరాలు ఏర్పాటుతో నిఘా పెట్టామన్నారు. అడిషనల్ డీసీపీ-2, ఏసీపీ-6, సీఐ-25, ఎస్ఐ-26తో పాటు ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్లు, హోంగార్డులు, బీడీ టీమ్స్, యాక్సెస్ కంట్రోల్, రోప్ పార్టీ సిబ్బంది మొత్తం కలిపి 361మందితో నాలుగు సెక్టార్లలో పటిష్ట బందోబస్తు చేపడుతున్నట్లు తెలిపారు. భక్తులు పోలీసుల సలహాలు, సూచనలు పాటిస్తూ ప్రశాంతంగా దైవదర్శనం చేసుకుని వెళ్లాలన్నారు. నాలుగు దిక్కులా పార్కింగ్ స్థలాల్లో వాహనాల పార్కింగ్ చేయాలని సూచించారు. రోడ్డుపై అడ్డదిడ్డంగా పార్కింగ్‌చేసినవాటిని సీజ్ చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సిద్దిపేట ఏసీపీ మధు, గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రవీందర్, చేర్యాల సీఐ శ్రీను, హుస్నాబాద్ సీఐ శ్రీను,కొమురవెల్లి ఎస్ఐ రాజు తదితరులు పాల్గొన్నారు.



రతీబియ్యం తీసుకొస్తున్న మహిళలు

14మంది అదనపు అధికారుల నియామకం

మల్లన్న కల్యాణాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు దేవాదాయశాఖ గతంలో ఎన్నడూలేనివిధంగా ఈసారి ప్రత్యేకదృష్టి సారించింది. ఈవో బాలాజీశర్మ కుటుంబ సభ్యుడు ఇటీవల మరణించడం, పూజా కార్యక్రమాల నిర్వహణకు ఆయన దూరంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొనడంతో పాటు ఆయన ఈ నెలాంతంలో పదవీ విరమణ పొందనున్నారు. దీంతో మల్లన్న కల్యాణం నిర్వహణపై అయోమయం నెలకొందన్న విషయమై ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో కొండగట్టు దేవాలయ ఈవో రామకృష్ణారావును పర్యవేక్షణాధికారిగా, కీసర రామలింగేశ్వర దేవాలయ ఈవో సుధాకర్‌రెడ్డిని ఫెస్టివల్ ఆఫీసర్లుగా నియమించారు. ఉత్సవ నిర్వహణ అధికారులకు తోడుగా పలు జిల్లాలకు చెందిన 14మంది అధికారులను నియమించింది. ఎన్నడూలేనివిధంగా మలన్న కల్యాణానికి 16మంది ప్రత్యేకాధికారులను నియమించడం చర్చనీయాంశంగా మారింది.



ముస్తాబైన కల్యాణ వేదిక

క్రైం కార్నర్

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కొల్చారం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మంజీరా నదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి మంజీరా నదిలో మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న వారు మృతదేహాన్ని పరిశీలించారు. వారం రోజుల క్రితం మృతి చెందవచ్చనని పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు 40 నుంచి 50 మధ్యలో ఉంటుందని, ఎరుపు రంగు బనీన్, బ్లూ కలర్ ప్యాంటు ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. కాగా, మంజీరా నదిలో నెలకు నాలుగైదు మృతదేహాలు లభ్యమవుతుండడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మృతులు వేరే ప్రాంతాల వారే కావడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

మిల్లర్ ట్రాక్టర్ బోల్తా.. కూలీలకు గాయాలు



బోల్తా పడిన మిల్లర్ ట్రాక్టర్

మాసాయిపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మిల్లర్ ట్రాక్టర్ బోల్తా పడడంతో పలువురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తూప్రాన్‌కు చెందిన సుమారు 16 మంది కూలీలు అచ్చంపేట వద్ద ఓ ఇంటి స్లాబు వేయడానికి మిల్లర్ ట్రాక్టర్‌లో తూప్రాన్ నుంచి శనివారం ఉదయం బయలుదేరారు. హకీంపేట శివారులోకి రాగానే మూలమలుపు వద్ద వేగంగా వెళ్తున్న ట్రాక్టర్ ఒక్కసారిగా రోడ్డు పక్కకు బోల్తా పడింది. ఈ ఘటనలో 10 మంది కూలీలకు స్వల్పంగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం



రమేష్ (ఫైల్)

జహీరాబాద్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) : మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యమైన సంఘటన మొగుడంపల్లి మండలంలోని ధనసిరి గ్రామంలో చోటుచేసుకుంది. చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వడ్డేల రమేష్(23) ఈ నెల 13న ఇంట్లో నుంచి బయటికెళ్లి తిరిగిరాలేదు. బంధుమిత్రుల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో రమేష్ తండ్రి ఎల్లప్ప అదేరోజున పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సదరు వ్యక్తి ఎక్కడైనా కనిపిస్తే చిరాగ్‌పల్లి పోలీసులకు సమాచారం అందించాలని శనివారం ఎస్ఐ కోరారు.

20 రోజుల వ్యవధిలో తండ్రి, కొడుకు మృతి

● పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబం



పాపయ్య (ఫైల్)

పుల్‌కల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): 20 రోజుల వ్యవధిలోనే తండ్రి, కొడుకు మృతి చెందటంతో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. వివరాలిలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రం చౌటకూర్‌కు చెందిన లక్దారం పాపయ్య(40) మండలంలోని సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. శనివారం తెల్లవారు జామున ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో అతడికి తీవ్ర గుండె నొప్పి వచ్చింది. దీంతో చికిత్స నిమిత్తం సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. కాగా, పాపయ్య తండ్రి లక్దారం భూమయ్య(70) ఈ నెల 7న అనారోగ్యంతో మృతి చెందాడు. తండ్రి పెద్దకర్మతో పాటు ఇతరత్ర కార్యక్రమాలు కొనసాగుతుండగానే కొడుకు మృతి చెందడం ఆ కుటుంబాన్ని తీరని దుఃఖసాగరంలో ముంచేసింది. పాపయ్యకు భార్య కవిత, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. పాపయ్య మృతిపై సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జి.నరసింహ సంతాపం వ్యక్తం చేశారు.

సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభం

● 656 మంది క్రీడాకారులు హాజరు



హాజరైన క్రీడాకారులు

మెదక్ అర్బన్, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): సీఎం కప్ రాష్ట్రస్థాయి యి సాఫ్ట్‌బాల్ పోటీలు శనివారం మెదక్ స్టేడియంతోపాటు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు రాష్ట్రంలోని 21 జిల్లాలకు చెందిన పురుషులు 336, మహిళలు 320 మొత్తం 656 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు మాట్లాడుతూ గ్రామీణ క్రీడారంగాన్ని బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ పోటీలు ఈ నెల 31 వరకు కొనసాగనున్నట్లు వెల్లడించారు.

విజేత జట్లు ఇవే..

మహిళల విభాగంలో కొత్తగూడెంపై 0-11 తేడాతో నిజామాబాద్ గెలుపొందగా, పెద్దపల్లిపై 0-11 సిద్దిపేట విజయం సాధించింది. అలాగే నల్గొండపై 10-16తో వరంగల్, హైదరాబాద్‌పై 02-13తో హనుమకొండ, ఆసిఫాబాద్‌పై 02-13 తో రంగారెడ్డి, జనగాంపై 00-10తో మహబూబ్‌నగర్, మంచిర్యాలపై 01-11 జగిత్యాల జిల్లా జట్టు విజయం సాధించాయి. ఇక పురుషుల విభాగంలో రాజన్నసిరిసిల్లపై 0-15 తేడాతో హనుమకొండ గెలువగా, మేడ్చల్‌పై 0-12తో మెదక్, మంచిర్యాలపై 0-2తో హైదరాబాద్ విజయం సాధించింది.

చిల్లర దోపిడీ..!

● ఆసరా పింఛన్ల పైన వచ్చే రూ.16 నొక్కేస్తున్నవైనం
● రెండు సంవత్సరాలుగా అదే తంతు
● అడిగినవారిని బెదిరిస్తున్న సిబ్బంది

చేయూత పింఛన్లలో పోస్టల్ సిబ్బంది చేతివాటం



కందిలో పింఛన్ కోసమే ఎదురుచూస్తున్న వృద్ధులు

అపరిచితుడు సినిమాలో హీరో విక్రమ్ చెప్పినట్టు ఐదు పైసలు దొంగతనం చేస్తే పెద్ద తప్పు కాదు. కానీ ఐదు కోట్ల మంది ఐదు పైసలు దొంగతనం చేస్తే... అది కూడా ఐదు కోట్ల మంది ఐదు కోట్లసార్లు ఐదయిదు పైసలు దొంగతనం చేస్తే పెద్ద దొంగతనమే అవుతుంది. అలాంటి దొంగతనమే ఆసరా పింఛన్లలో కూడా జరుగుతున్నది.

కంది, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, బీడీ కార్మికులకు నెలవారీగా ప్రభుత్వం అందజేసే చేయూత పింఛన్లలో పోస్టల్ సిబ్బంది చేతివాటం చూపిస్తున్నారు. రెండుమూడేళ్లుగా కందిలోని పోస్టల్ బ్యాంకు సిబ్బంది ఆసరా పింఛన్లలో వచ్చే కొసర డబ్బులను కట్ చేసుకుని అందజేస్తున్నారు. కొందరికి నెలకు రూ.16 కోత విధిస్తుంటే, మరికొందరి వద్ద రూ.6 చొప్పున నెలవారీగా దండుకుంటున్నారు. వికలాంగులకు నెలకు రూ 3016, మిగతా వారికి రూ.2016 ప్రభుత్వం అందిస్తున్నది. అయితే గత కొన్ని సంవత్సరాలుగా పింఛన్‌పైన అందజేసే రూ.16ను గుట్టుచప్పుడు కాకుండా పోస్టల్ సిబ్బంది నొక్కేయడం మండల వ్యాప్తంగా చర్చనీయంశంగా మారింది. శనివారం ఆసరా పింఛన్‌దారులంతా కందిలోని పోస్టాఫీస్ వద్ద ఆందోళన చేశారు. తమకు రావలసిన పింఛన్ మొత్తం అణా పైసలతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ ఆసరా కోసం ప్రభుత్వం పంపిణీ చేసే డబ్బులలో కోత విధించడం ఎంతవరకు సమంజసం అని వాపోయారు. అసలే ఓ పక్క ఆసరా లేక తాము బాధపడుతుంటే మాపై ఎలాంటి దయా, జాలి చూపకుండా దోచుకోవడం బాధిస్తున్నదని ఆంధ్రజ్యోతికి చెప్పుకొని విచారం వ్యక్తం చేశారు. ఈ విషయం గురించి పోస్టల్ అధికారులను సంప్రదించగా వారు వివరణ ఇచ్చేందుకు విముఖత చూపారు. సిబ్బందిని కూడా ఎవరితో మాట్లాడవద్దని హుకుం జారీ చేశారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం వల్లనే చేయుత పింఛన్లలో ఇలా చిల్లర దోపిడి జరుగుతుందని పింఛన్‌దారులు ఆరోపిస్తున్నారు.

4255 మంది చేయూత పింఛన్‌దారులు

కంది మండలంలోని 22 గ్రామాల్లో మొత్తం 4255 మంది పింఛన్‌దారులు ఉన్నారు. వీరిలో వికలాంగులు 419, వృద్ధులు 1357 వితంతువులు 2253 మంది కల్లుగీత కార్మికులు 84, చేనేత కార్మికులు 3, ఒంటరి మహిళలు 139 మంది ఉన్నారు. వీరందరికి అందరికీ బ్యాంకు, పోస్టల్ శాఖ ద్వారానే నెలవారి పింఛన్లు అందుతాయి. పోస్టాఫీస్ లేని గ్రామాల్లో ఆ బ్రాంచికి సంబంధించిన సిబ్బంది వెళ్లి పింఛన్లను పంపిణీ చేసి వస్తారు. 2వేలు, 3 మూడు మాత్రమే ఇస్తున్నారని, పైన వచ్చే రూ.16 ఇవ్వడం లేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. అడిగితే తమపై కసురుకుంటున్నారని వాపోయారు. మండలవ్యాప్తంగా 4255 మంది నుంచి నెలకు 16 రూపాయల చొప్పున లెక్కేస్తే దాదాపుగా రూ.68 వేలు దోపిడీకి గురవుతున్నది. ఈ లెక్కన ఏడాదికి ఎంత మేర దోపిడీ జరుగుతుందో ఇట్టే అర్థమవుతుంది. ఈ విషయంపై దృష్టి సారించి వెంటనే పింఛన్‌దారులకు న్యాయం చేయాలని పలు ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.

రెండేళ్లుగా ఇవ్వటం లేదు



గత రెండు సంవత్సరాల నుంచి నాకు పింఛన్ ద్వారా వచ్చే డబ్బులో పైన రూ.16 ఇవ్వడం లేదు. అడిగితే చిల్లర తెచ్చివ్వు ఇస్తాం అని పోస్టల్ సిబ్బంది కసురుకుంటున్నారు. ఇలా అచేతనుల దగ్గర చిల్లర నొక్కేయడం అధికారులకు సబబుగా ఉందా. ఈ విషయంలో అందరికీ న్యాయం జరిగేలా చూడాలి

-బిక్షపతి, కంది

రూ. 2010 మాత్రమే ఇస్తున్నారు



గత మూడేళ్లుగా పోస్టల్ సిబ్బంది నాకు 2016లకు గాను రూ.2010వేలు మాత్రమే అందిస్తున్నారు. పైన వచ్చే రూ.6 ఇప్పటికీ ఇవ్వలేదు. కనీసం ఆ డబ్బులను బుక్‌లో కూడా రాయడం లేదు. ఇదేమిటని ప్రశ్నిస్తే వారు స్పందించడం లేదు. అడిగితే బెదిరిస్తున్నారు తప్ప న్యాయం జరగడం లేదు.

-సర్వరున్నీసా బేగం, కంది

అడిగినా ఇస్తలేరు..



గత కొన్ని నెలలుగా నాకు ఆసరా పింఛన్‌లో వచ్చే పై రూ.16 ఇవ్వడం లేదు. రూ.2 వేలు మాత్రమే ఇస్తున్నారు. చిల్లర గురించి పోస్టల్ సిబ్బందిని ఎన్నిసార్లు అడిగినా వారు మాట్లాడడం లేదు. మా పరిస్థితి ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక మిన్నకుండిపోయాం. అధికారులు దృష్టి సారించి అందరికీ న్యాయం చేయాలి.

- రూప్లా నాయక్, చిమ్నాపూర్ తండా

కొనాళ్లుగా ఇదే పరిస్థితి..



ఆసరా పింఛన్లు వచ్చే పూర్తి డబ్బులు అడిగితే వారు ఒక నెల రూ.16, మరో నెల రూ.6 చొప్పున కట్ చేసి ఇస్తున్నారు. గత కొన్నాళ్లుగా ఇక్కడ ఇదే పరిస్థితి కొనసాగుతున్నది. ఈ విషయంపై అధికారులు దృష్టి సాధించి విచారణ చేపట్టాలి. అప్పుడే మాలాంటి వాళ్లకు న్యాయం జరుగుతుంది.

-బాలామణి, చిమ్నాపూర్

క్రైం కార్నర్

నారింజ ప్రాజెక్టులో పడి వ్యక్తి మృతి

జహీరాబాద్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) : మండలం పరిధి కొత్తూర్(బి) గ్రామంలోని నారింజ ప్రాజెక్టులో పడి వ్యక్తి మృతిచెందాడు. జహీరాబాద్ రూరల్ ఎస్ఐ ప్రసాదరావు కథనం ప్రకారం జహీరాబాద్ పట్టణానికి చెందిన కోలి శివకుమార్(45) శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బైక్‌పై బయటికెళ్లి తిరిగిరాలేదు. తీరా శనివారం మధ్యాహ్నం నారింజ ప్రాజెక్టులో శవమై కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు రాకేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యా.. ఎవరైన తోసేసారా అన్న కోణంలో విచారణ చేపడుతున్నామని ఎస్ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి..



నర్సింహులు (ఫైల్)

కొండపాక, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : చెరువలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన కొండపాక మండలం అంకిరెడ్డిపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పోకల నర్సింహులు (40) శనివారం స్థానిక చెరువులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు. సాయంత్రం అటువైపు వెళ్లిన వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..

చిన్నశంకరంపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం నార్సింగి గ్రామానికి చెందిన దంపతులు చంద్రయ్య, యాదమ్మ(60) రెండు రోజుల కిత్రం చిన్నశంకరంపేట మండలం రుద్రారం గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నారు. మిర్జాపల్లి గ్రామ శివారులో రాగానే బైక్ అదుపుతప్పి ఇద్దరు కిందపడి తీవ్ర గాయాలపాలయ్యారు. దీంతో వారిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో యాదమ్మ (60) శనివారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు దయాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి..



నాగరాజు (ఫైల్)

చిన్నశంకరంపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) :పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన చిన్నశంకరంపేట మండలంలోని సూరారంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పిట్ల నాగరాజు(34) కొన్ని రోజుల నుంచి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. దీంతో ఐదు రోజుల క్రితం గ్రామ శివారలోని కుమ్మరి కుంట వద్ద పురుగుల మందు తాగి తన భార్య నవనీతకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. కుటుంబ సభ్యులకు అక్కడికి చేరుకుని అతడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దంపతుల మధ్య గొడవ.. భర్త ఆత్మహత్య



రమేష్(ఫైల్)

దౌల్తాబాద్, డిసెబంబర్ 28 (ఆంధ్రజ్యోతి) అప్పుల విషయంలో భార్యాభర్తల మధ్య గొడవ జరగగా భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాల ప్రకారం దౌల్తాబాద్ మండలం సూరంపల్లి గ్రామానికి చెందిన కానుగుల రమేష్(42) మేస్త్రీ పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గతేడాది రమేష్ బైక్ పైనుంచి పడి కాలు విరగడంతో పనికి వెళ్లకుండా ఇంటికే పరిమితమై ఇటీవలే కోలుకున్నాడు. గతంలో ఇంటి నిర్మాణానికి చేసిన అప్పుల విషయంలో శనివారం భార్యాభర్తల మధ్య చిన్నపాటి గొడవ జరగింది. దీంతో మనస్తాపం చెందిన రమేశ్ ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య కానుగుల శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

న్యూస్ బాక్స్

పోచమ్మగుడి నిర్మాణానికి రూ.లక్ష విరాళం

జిన్నారం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిన్నారంలో నిర్మిస్తున్న పోచమ్మ ఆలయానికి పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ రూ.లక్ష విరాళం అందజేశారు. శనివారం జిన్నారం మండల నాయకులు వెంకటేశంగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి, లింగం, మల్లేష్, శేఖర్ కుమార్‌యాదవ్‌ను కలువగా.. పోచమ్మ ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందజేశారని తెలిపారు.

నేడు సహజ యోగా ధ్యాన పరిచయం

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సహజ యోగా ధ్యాన పరిచయ కార్యక్రమం ఈనెల 29న సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు జరుగుతుందని సహజ యోగా ట్రస్ట్ సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ వీరేంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యానగర్ కలెక్టరేట్ గ్రౌండ్‌లో జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర కోఆర్డినేటర్లు కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి గ్రామ పరిధిలోని మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10 నుంచి 1 గంటలవరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో ఏఈ ప్రశాంత్ తెలిపారు. సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం ఆవరణలోని విద్యుత్ సబ్‌స్టేషన్ 33-11కేవీ మరమ్మతులు, 33కేవీ లైన్ విద్యుత్ తీగల మధ్య ఉన్న వృక్షాల తొలగించే క్రమంలో పోతిరెడ్డిపల్లి, ఏపీహెచ్‌బీ, పొన్న కాలనీ, సండే మార్కెట్, విద్యానగర్, బ్యాంక్ కాలనీ, కలెక్టర్ కార్యాలయం, బైపాస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు.

శివ్వంపేటలో..

శివ్వంపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పిల్లుట్ల 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా పిల్లుట్ల, రత్నాపూర్, నానుతండాలో ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఇన్‌చార్జి ఏఈ సాయికుమార్ శనివారం తెలిపారు. ఆయా గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేందుకే జమిలి ఎన్నికలు

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేందుకే కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికలకు వెళ్తున్నదని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ విమర్శించారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

'ఇండెన్ గ్యాస్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలి'

మనూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మనూరులో ఉన్న ఇండెన్ గ్యాస్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని సీపీఎం ఖేడ్ డివిజన్ కార్యదర్శి నల్లవల్లి రమేష్ డిమాండ్ చేశారు. ఈ విషయమై శనివారం ఎంపీడీవో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఈసీసీ డే

శివ్వంపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శివ్వంపేట మండలంలోని కొత్తపేట అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ సంతోష, వసుమతి ఆధ్వర్యంలో శనివారం (ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ వైన్ ఎడ్యుకేషన్ డే) ఈసీసీ డే నిర్వహించారు. పిల్లల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

'ఉచిత కుట్టుమిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి'

కోహీర్: ప్రభుత్వం ఉచితంగా అందించనున్న కుట్టు మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో భారతీ పేర్కొన్నారు. ఇందిరమ్మ మహిళా శక్తి పథకంలో భాగంగా మైనారిటీ వర్గాలకు చెందిన అర్హులైన ముస్లిం, క్రిస్టియన్ మహిళలకు ప్రభుత్వం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఉచితంగా కుట్టు మిషన్లను అందజేస్తుందన్నారు. ఉచిత కుట్టు మిషన్ల కోసం అర్హులైన వారు హెచ్‌టీటీపీఎస్://టీజీవోబీఎంఎంఎస్.సీజీజీ.జీవోవీ.ఇన్/అనే వెబ్‌సైట్ దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

క్రైం కార్నర్

గంజాయి విక్రేత అరెస్ట్

చిన్నశంకరంపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని పరిశ్రమల కాలనీలో ఎక్సైజ్ అధికారులు శనివారం పట్టుకున్నారు. రామాయంపేట ఎక్సైజ్ సీఐ రాణి మాట్లాడుతూ విశ్వసనీయ సమాచారం మేరకు రాధా స్టీల్ పరిశ్రమ వద్ద బీహార్ రాష్ట్రానికి చెందిన రాజేష్ రిసిదేవ్ అక్రమంగా నిషేధిత గంజాయిని విక్రయిస్తుండగా పట్టుకుని, 190 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైస్ ఎస్ఐ విజయసిద్ధార్థ, సిబ్బంది దుర్గారెడ్డి, వెంకటేశం, స్వామి, దినేష్, శ్రీకాంత్, రాజేశ్ పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళిక: ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న శేరి సుభాష్‌రెడ్డి

మెదక్ అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పటిష్ట ప్రణాళిక రూపొందించి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ నగేష్ తో కలిసి నియోజకవర్గ అభివృద్ధిపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెదక్‌ను అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్సీ నియోజకవర్గ నిధులతో కృషి చేస్తున్నామన్నారు. 2021-22, 2022-23 సంవత్సరానికి రూ.5 కోట్ల 60 లక్షలతో 94 పనులు చేపట్టామన్నారు. ఇప్పటివరకు 55 పనులు పూర్తికాగా.. మిగిలిన పనులు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. 2023-24 సంవత్సరానికి రూ.3 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అంతేకాకుండా నియోజకవర్గంలో గ్రీన్‌ఫండ్ కింద రూ.62 లక్షల నిధులు మంజూరయ్యాయని, మెదక్ టౌన్‌లో కానీ, కొల్చారం మండలంలో నవగ్రహ వనం నక్షత్రవనం కార్యక్రమం అమలు చేయాలనే ఆలోచనతో ముందుకు వెళ్తున్నట్లు వివరించారు. 9 రకాల చెట్లు నాటేందుకు ప్రణాళికలు రూపొందించాలని, 21 నక్షత్రాలకు చెట్లు నాటి వాటి పేర్లతో బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. వైకుంఠ రథాలు మంజూరు చేసేందుకు పునరాలోచన చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సీపీవో బద్రీనాథ్, పీఆర్ ఈఈ నరసింహులు, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

స్థానికసంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి: ఎమ్మెల్యే

ఝరాసంగం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి తమ సత్తా చాటాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని కుప్పానగర్ గ్రామంలో సుడిగాలి పర్యటనను చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన కార్యకర్తలు, నాయకులను కలిసి మాట్లాడారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రజల సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిదని, ఏడాది పాలనపై వారంత విసుగు చెందుతున్నారన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఎనలేని అభివృద్ధి చేశామన్నారు. అందులో భాగంగా పలువురు నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే మాణిక్‌రావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశం, నాయకులు నర్సింహాగౌడ్, లక్ష్మణ్, ఖలీల్, శంకర్, ప్రభుపాటిల్, గ్రామస్థులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత రంగంలో సునీతాఖన్నాకు డాక్టరేట్



డా.పి.సునీతఖన్నా

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మహిళా సాధికారత రంగంలో సంగారెడ్డి జిల్లాకు చెందిన ఉపాధ్యాయురాలు డా.పి.సునీతఖన్నాకు డాక్టరేట్ వరించింది. ఐకానిక్ పీస్ అవార్డ్ కౌన్సిల్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి డిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆమె డాక్టరేట్ అవార్డును అందుకున్నారు. మహిళా సాధికారత, సమాజంలో వివిధ రంగాల్లో విశేష కృషి, బాలికల విద్యకు చేస్తున్న కృషిని గుర్తించిన సంస్థ డాక్టరేట్ అవార్డుకు ఎంపిక చేసిందని ఆమె తెలిపారు. ఇలా ఉండగా సునీతాఖన్నా.. 2024లో ఎంపవర్డ్ ఉమెన్ అవార్డు, మిసెస్ ఇండియా ఫేస్ ఆఫ్ సౌత్-2023, ఇక 2020లో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు సొంతం చేసుకున్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం (తెలంగాణ) చైర్‌పర్సన్‌గా సునీతాఖన్నా సేవలందించారు. తెలంగాణ ప్రభుత్వం తరపున పాఠ్యపుస్తకాలు రాసి పాఠ్య పుస్తక రచయితగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. రాష్ట్రస్థాయి ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాల నిర్వహణలో ప్రముఖ పాత్ర పోషించారు. ఎస్‌సీఈఆర్‌టీ సభ్యురాలిగా జాతీయ, రాష్ట్ర స్థాయి అభ్యాస కార్యక్రమాల్లో ఆమె చురుకుగా పాల్గొన్నారు. సర్వశిక్షా అభియాన్‌లో జెండర్ కో ఆర్డినేటర్‌గా, బాల్య వివాహాలు నిలిపివేయడం, బాలిక విద్యను ప్రోత్సహించడంలో ముఖ్య పాత్ర పోషించారు. సునీతాఖన్నాను పలువురు విద్యావేత్తలు ప్రశంసిస్తున్నారు.

నిరంతర అధ్యయనంతో ఉన్నతస్థాయికి చేరుకోగలం



వెంకట మధుకుమార్‌కు గోల్డ్‌మెడల్‌ను అందజేస్తున్న కుమార్ మొలిగారం, చిత్రంలో ప్రొఫెసర్ ఖాశీం, కళాశాల కరస్పాండెంట్ రవి అనంత

పటాన్‌చెరు రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : న్యాయ విద్య పట్టాలను అందుకున్న విద్యార్థులు సమాజం పట్ల మరింత బాధ్యతగా మెలగాలని ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ కుమార్ మొలుగారం అన్నారు. పటాన్‌చెరు మండలం ముత్తంగిలో విశ్వభారతి లా కాలేజీ నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డేకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 2020-23, 2021-24లలో న్యాయ విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. గౌరవ అతిథిగా హాజరైన ప్రొఫెసర్ ఖాశీం మాట్లాడుతూ న్యాయవాదులు రాసే పిటిషన్ ఒక జీవితాన్ని నిలబెడుతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం 2021-24 విద్యా సంవత్సరానికి సంబంధించి అనంత రాజమ్మ స్మారక అవార్డులను అందించారు. వెంకట మధు కుమార్ గోల్డ్ మెడల్ అందుకోగా.. భాగ్యవతి సిల్వర్ మెడల్‌ను దక్కించుకున్నారు.

ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ

చిన్నశంకరంపేట/వెల్దుర్తి/రేగోడు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని అనంత పద్మనాభస్వామి గుట్ట వద్ద అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప మహాపడి పూజ, ఇరుముడి పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన తదితర పూజలను జరిపారు. ఈ పూజలో ఎమ్మెల్సీ శేరి శుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, హన్మంతరావు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. మండల కేంద్రమైన వెల్దుర్తిలోని శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో అయ్యప్పస్వాముల ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. 41 రోజుల పాటు దీక్ష చేసిన స్వాములు ఇరుముడితో శబరీకి బయలుదేరారు. అలాగే రేగోడు నుంచి అయ్యప్పస్వాములు గోకర్లేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, శబరిమలకు బయలుదేరారు.

ఎఫ్‌టీఎల్‌ను పరిశీలించిన అధికారులు

జిన్నారం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాజీపల్లి గండిచెరువు ఎఫ్‌టీఎల్, కాలుష్య సమస్యపై ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పరిశీలన జరిపారు. శనివారం గండి చెరువును ఇరిగేషన్ డిప్యూటీ ఈఈ రామస్వామి, ఏఈ ప్రసాద్, పీసీబీ అధికారి రవీందర్ పరిశీలించారు. గండి చెరువు ఎఫ్‌టీఎల్ పరిధికి మించి నీటి నిల్వతో వ్యవసాయ పంటల మునక, పరిశ్రమల కాలుష్యంతో నీటి కాలుష్యంపై స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా.. అధికారులు చెరువును సందర్శించారని నాయకులు రమాకాంత్ తెలిపారు. ఎఫ్‌టీఎల్ పరిధిపై సమాచారం సేకరించిన అధికారులు జనవరి 3న మరోమారు స్థానికంగా సమావేశం జరుపుతామని తెలిపారు. పీసీబీ అధికారులు చెరువులోని నీటి శాంపిళ్లను సేకరించారు.

చాకరిమెట్లలో శని త్రయోదశి పూజలు

శివ్వంపేట/వట్‌పల్లి/నారాయణఖేడ్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : శివ్వంపేట మండలం చిన్న గొట్టిముక్కలలోని చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శని త్రయోదశి పురస్కరించుకొని ఆలయ చైర్మన్ ఆంజనేయశర్మ, పూజారుల ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామివారిని అదనపు కలెక్టర్ నగేష్ దంపతులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో సార శ్రీనివాస్, పూజారులు పాల్గొన్నారు. వట్‌పల్లి మండలం దుద్యాలలోని సర్వేశ్వర పూరి ఆశ్రమంలో శని త్రయోదశిని పురస్కరించుకుని శనీశ్వరుడికి ఆశ్రమ పీఠాధిపతి అంబికా శివయోగి పూజారి తైలాభిషేకం నిర్వహించారు. నారాయణఖేడ్ ప్రాంతంలోని హనుమాన్ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కొండాపూర్‌లో చరిత్రాత్మకమైన హనుమాన్ ఆలయంలో హారతి, చందనం, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి సంగ్రాం మహరాజ్, భక్తులకు ఆశీస్సులు అందించారు. డోపూరు లొంక హనుమాన్, కల్పనా హనుమాన్, అభయాంజనేయస్వామి ఆలయాలను భక్తులు సందర్శించారు.

ఉచిత వైద్యసేవలను వినియోగించుకోవాలి: డీఈవో



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న డీఈవో రాధాకిషన్

చిన్నశంకరంపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఉచిత కంటి వైద్య సేవలను వినియోగించుకోవాలని డీఈవో రాధాకిషన్ అన్నారు. ఎస్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో సురక్ష మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి సౌజన్యంతో శనివారం మండల కేంద్రంలోని హైస్కూల్లో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని డీఈవో ప్రారంభించారు. 200 మందికి పైగా ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి, అద్దాలు అందజేశారు. డీఈవో సైతం కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఎస్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు గోపాల్ గౌడ్, అసోసియేట్ జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్, ఎస్టీయూ మండలాధ్యక్షుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేయాలి



మాట్లాడుతున్న మెదక్ డీఎల్పీవో సురేష్‌బాబు

పెద్దశంకరంపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే తప్పులు లేకుండా తొందరగా పూర్తి చేయాలని మెదక్ డీఎల్పీవో సురేష్‌బాబు అన్నారు. శనివారం పెద్దశంకరంపేటలోని గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడి వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఎంపీడీవో రఫీక్‌ఉన్నిసా, ఎంపీవో విఠల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటరాములు;పాల్గొన్నారు.

ఏడుపాయల టెండర్ల ఆదాయం రూ.3.65 లక్షలు

పాపన్నపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయానికి టెండర్ల ద్వారా రూ.3.65 లక్షల ఆదాయం సమకూరింది. శనివారం ఆలయ కార్యాలయంలో ఈవో చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ రంగారావు ఆలయం వద్ద ఏడాదిపాటు సగ భాగం కొబ్బరి ముక్కలు పోగు చేసేందుకు వేలం నిర్వహించారు. వేలంలో సదరు ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు. ఆలయ సిబ్బంది శ్రీనివాస్, శ్యామ్, ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.

ఇతర పాఠశాల టీచర్లు వద్దు.. మా టీచర్లే ముద్దు



కస్తూర్బా పాఠశాల విద్యార్థుల నిరసన

పాపన్నపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఇతర పాఠశాల టీచర్లు వద్దు.. మా టీచర్లే కావాలని విద్యార్థులు ఆందోళన చేసిన సంఘటన పాపన్నపేట కస్తూర్బా పాఠశాలలో శనివారం చోటు చేసుకుంది. సమగ్ర శిక్షా సిబ్బంది 20 రోజులుగా సమ్మెలో ఉండడంతో కస్తూర్బా పాఠశాలల్లో బోధన సరిగా సాగడం లేదన్నారు. శనివారం పాపన్నపేట ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు బోధించేందుకు వెళ్లగా అక్కడ ఉన్న విద్యార్థులు మా ఉపాధ్యాయులే పాఠాలు బోధించాలని, వేరే ఉపాధ్యాయులు చెప్పొద్దని ఆందోళన చేశారు. ప్రభుత్వం స్పందించి తిరిగి తమ టీచర్లను విధుల్లోకి వచ్చేలా చూడాలన్నారు. ఎంఈవో ప్రతాప్‌రెడ్డి విద్యార్థులకు నచ్చజెప్పినా వినకపోవడంతో ఉపాధ్యాయులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులు

కంది/వట్‌పల్లి/జహీరాబాద్/రామచంద్రాపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కంది మండల పరిధిలోని ఎద్దుమైలారం వద్దనున్న మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగులు, ఐఎన్‌టీయూసీ, జేఏసీ నాయకులు శనివారం దివంగత మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరనిలోటని పేర్కొన్నారు. ఆయన చేపట్టిన ఆర్థిక సంస్కరణలు దేశాన్ని అగ్రస్థానంలో నిలిపాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు కే.రవీందర్, గణేశ్ పాల్గొన్నారు. మండల కేంద్రమైన వట్‌పల్లిలో కాంగ్రెస్ నాయకులు, గొర్రెకల్‌లో గ్రామపంచాయతీ కార్మికులు మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. జహీరాబాద్ పట్టణంలో యువజన కాంగ్రెస్ నాయకులు మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పించారు. అందులో భాగంగా పట్టణంలోని సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గెస్ట్‌హౌజ్ ఆవరణలో ఏర్పాటుచేసిన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెల్లాపూర్‌లో శుక్రవారం రాత్రి మన్మోహన్‌సింగ్ సంతాప సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పర్స శ్యాంరావు మాట్లాడారు.

'సంఘటితంగా ముందుకు సాగుదాం'

మెదక్ అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపులు సంఘటితమై ఐకమత్యంతో ముందుకు సాగితే తమ హక్కులను సాధించుకోవచ్చని మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బట్టి జగపతి పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మున్నూరుకాపు సంఘం ఫతేనగర్ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు వెంకన్న, శాఖ అధ్యక్షుడు కుల్ల నర్సింహులు, కార్యదర్శి అనిల్, మున్నూరుకాపులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఎంప్లాయీస్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక



కృష్ణను సన్మానిస్తున్న ఉద్యోగులు

పుల్‌కల్/నారాయణఖేడ్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) అందోలు-జోగిపేట డివిజన్ అధ్యక్షుడిగా కె.కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రం చౌటకూర్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో పుల్కల్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న కె.కృష్ణను ఎన్నుకున్నారు. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా జీ.నారాయణ, ఉపాధ్యక్షులుగా మల్లం రాజు, ఎం.మహిపాల్, పి.మహేశ్వరీ, ప్రధాన కార్యదర్శిగా కే.శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మన్నె మల్లేశం ఎన్నికయ్యారు. వీరితో పాటుగా సంయుక్త కార్యదర్శులుగా సయ్యద్ దావూద్, జీ.వంశీకృష్ణ, ఎన్.ఈశ్వర్, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా సీహెచ్.నవీన, కోశాధికారి బీ.లక్ష్మణ్, కార్యనిర్వాహక సభ్యులుగా డీ.భద్రయ్యతో పాటుగా మరో 25 మంది, జిల్లా కమిటీ సభ్యులుగా ఎండీ అశ్రఫ్, ఎం.మాధవితో పాటు మరో 25 మందిని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా అందోలు-జోగిపేట డివిజన్ అధ్యక్షుడు, రిటైర్డ్ తహసీల్దార్ ఎం.కిష్టయ్య వ్యవహరించారు. ఇందులో జిల్లా అధ్యక్షుడు బొమ్మ రాములు, నాయకులు మన్నె కిరణ్‌కుమార్, గంగాధర్, దశరత్, బాలరాజ్, రవికుమార్ పాల్గొన్నారు. అలాగే తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ ఖేడ్ డివిజన్ ఎన్నికలు శనివారం రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో జరిగాయి. అధ్యక్షుడిగా బీ.ఈశ్వర్, ప్రధాన కార్యదర్శిగా రాజుపటేల్ ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షులుగా ఎస్ఏ.అబ్దుల్‌మొగ్ని, ఉపాధ్యక్షులుగా తాజోద్దీన్, హన్మంత్ రెడ్డి, సీహెచ్.రామలక్ష్మి, రాజ్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శిగా శంకర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా మల్లేశం, కిషన్, జాన్సన్, కోశాధికారిగా మాధవరెడ్డి స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా మదన్‌మోహన్, కార్యవర్గసభ్యులుగా సుధాకర్, ఖాజామైనోద్దీన్, రాజు, రమేష్, డీసీ సభ్యులుగా హన్మంత్, సాయిలు, కే.రాజులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా పండరినాథ్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు గంగాధర్, దశరత్, డిప్యూటీ తహసీల్దార్లు కిరణ్‌కుమార్, బాలరాజ్, కార్తీక్, రవి, నారాయణ, నాగరాజు పాల్గొన్నారు.

కన్నీటి సాగు

5వ పేజీ తరువాయి

ధాన్యం తడిసిపోవడం మూలంగా తేమ శాతం పెరిగింది. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికీ ధాన్యం సేకరణ ఆలస్యమవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారుల వైపు చూశారు. 17 శాతం మించి తేమ కలిగిన ధాన్యాన్ని కొనుగోలు చేయమని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తేల్చి చెప్పడంతో పారాబాయిల్డ్ రైస్ మిల్లులకు చెందిన కొందరు వ్యాపారులు తమిళనాడుకు తరలించారు. ఇక ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా ఈ సారి వ్యాపారులు రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేశారు. ఈ ఏడాది మెదక్ జిల్లాలో రైతులు సన్నాలను అధికంగా పండించారు. వానాకాలం సీజన్‌లో లక్ష ఎకరాల విస్తీర్ణంలో సన్నాల పంటలు వేశారు. లక్షా 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం పెట్టుకున్న సివిల్‌సప్లై అధికారులు అందులో నగం మాత్రమే కొనుగోలు చేశారు. మిగతా ధాన్యం రైతులే మరపట్టించి తెలిసిన వారికి విక్రయించుకుని, తమ అవసరాలకు వాడుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన మద్దతు ధరకంటే అధికంగా వ్యాపారులు, మిల్లర్లు రైతులకు చెల్లించి సన్న వడ్లు కొనుగోలు చేశారు.

తగ్గిన పంట సాగు

2023 సంవత్సరంతో పోలిస్తే 2024లో ఆయా పంటల సాగు గణనీయంగా తగ్గింది. 2023 వానాకాలం సీజన్‌లో సంగారెడ్డి జిల్లాలో 7,18,721 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయగా ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో 7,06,044 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. గత యాసంగిలో లక్షా 91వేల 204 ఎకరాల్లో సాగు చేయగా ఈసారి ఇప్పటివరకు 39700 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. అయితే యాసంగి సీజన్ ఇప్పుడిప్పుడే ప్రారంభం కావడంతో సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.

రైతు భరోసా ఏదీ?

ప్రభుత్వం రైతుభరోసా కింద పెట్టుబడి సాయం ఇవ్వలేదు. గత ప్రభుత్వం హయాంలో రైతుబంధు పథకం కింద రెండు పంటలకు కలిపి ఎకరాకు రూ.10వేలు ఇచ్చింది. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తాము అధికారంలోకి రాగానే రైతుబంధుకు బదులుగా రైతు భరోసా పథకం ద్వారా రెండు పంటలకు కలిపి ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నప్పటికీ రైతు భరోసాను అమలు చేయడం లేదు. 2023లో వానాకాలం సీజన్‌తోపాటు యాసంగి సీజన్‌కు సంబంధించి మొత్తం మూడు సీజన్ల రైతుభరోసా అమలుకు నోచుకోవడంలేదు.

రుణమాఫీ కొందరికే!

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రుణమాఫీ పథకం కింద సంగారెడ్డి జిల్లాలో రూ.2లక్షల్లోపు రుణమాఫీ అయింది. మూడు విడుతలుగా రుణమాఫీని చేయగా సంగారెడ్డి జిల్లాలో 98,056 మంది అన్నదాతలకు రూ. 846.83కోట్లు రుణమాఫీ చేసినట్లు అధికారవర్గాలు తెలిపాయి. సంగారెడ్డి జిల్లాలో రుణాలను తీసుకున్న రైతులు 82 లక్షలకుపైగా ఉండగా కేవలం 98,056 మందికి మాత్రమే రుణాలను మాఫీ చేసింది. మెదక్ జిల్లాలో 77,163 మంది రైతులకు రూ.653 కోట్ల రుణమాఫీ జరిగింది.

రెవెన్యూ శాఖలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం

- కలెక్టర్‌కు తెలిపిన పూర్వ వీఆర్‌వోలు



కలెక్టర్‌క్రాంతిని కలిసి వినతిపత్రం అందజేస్తున్న పూర్వ వీఆర్‌వోలు

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూశాఖలోకి వచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పూర్వ వీఆర్‌వోలు సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతికి తెలిపారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్‌ను పూర్వ వీఆర్‌వోలు కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామస్థాయి అధికారులను నియమించేందుకు తీసుకున్న నిర్ణయానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ వీఆర్‌వోలు సత్యనారాయణ, సంతోష్‌కుమార్, శ్యామ్, శివరాములు, చంద్రశేఖర్, వెంకటయ్య, సంజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేద పిల్లలను దత్తత తీసుకున్న ప్రధానోపాధ్యాయురాలు



దత్తత తీసుకున్న పిల్లలతో ప్రధానోపాధ్యాయురాలు లీలావతి

కంది, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కందిలోని లక్ష్మీనగర్ కాలనీలో నివాసముండే సాయితేజ, తేజ, విజ్ఞేశ్వర్‌ను ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లీలావతి శనివారం దత్తత తీసుకున్నారు. సాయితేజ, తేజ, విజ్ఞేశ్వర్‌కు ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తయ్యే వరకూ మొత్తం ఖర్చులు తానే భరిస్తానని తెలిపారు. పేదలకు అండగా నిలిచి మానవత్వం చాటుకున్న లీలావతిని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

సొంత గూటికి ఉదయ్‌కుమార్

చిన్నశంకరంపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్‌లో చురుకుగా పనిచేసిన ఉదయ్‌కుమార్ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌లో చేరారు. శనివారం మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఉదయ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితుడినై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశం వాయిదా

నర్సాపూర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ మున్సిపల్ సమావేశం వాయిదాపడింది. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి పట్ల రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపి వాయిదా వేశారు. చైర్మన్ అశోక్‌గౌడ్ అధ్యక్షతన శనివారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించాల్సిన సమావేశం ప్రస్తుతం మన్మోహన్‌సింగ్ మృతికి ప్రభుత్వం మూడురోజుల పాటు సంతాపాలు ప్రకటించినందున వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రామకృష్ణ, వైస్ చైర్మన్ నయిమోద్దీన్, కౌన్సిలర్లు లత, ఇసత్‌సిద్దిఖీ, యాదగిరి, రుక్కమ్మ, రామచందర్ పాల్గొన్నారు.

వంటావార్పుతో పారిశుధ్య కార్మికుల నిరసన

చేగుంట/మెదక్ అర్బన్ డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య కార్మికుల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం చేగుంట ఎంపీపీ కార్యాలయం ఎదుట కార్మికులు వంటావార్పుతో నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బాలమణి ఐదు నెలలుగా కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మెదక్‌లోని కలెక్టరేట్ వద్ద జీపీ కార్మికులు ధర్నాకు దిగారు.

ఉపాధిహామీపై సామాజిక తనిఖీ

నాగల్‌గిద్ద, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ మూడవ విడత 2023-24 సంవత్సరానికి సంబంధించిన సామాజిక తనిఖీని శనివారం మండల కేంద్రమైన నాగల్‌గిద్దలో అధికారులు నిర్వహించారు. మండల పరిధిలో 31 గ్రామపంచాయతీలు ఉండగా, అందులో 24 గ్రామపంచాయతీల్లో ఉపాధిహామీ పనుల్లో అవకతవకలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. పలు గ్రామాల్లో కార్మికులు కూడా ఉపాధిహామీ పనుల్లో పాల్గొన్నారని అధికారులు గుర్తించారు. దీంతో రూ.1,24,504 లక్షల అవకతవకలు జరిగాయని, వీటి రికవరీ కోసం అధికారులు ఆదేశించారు. అదనపు పీడీ బాల్‌రాజ్, ఏపీడీ రాజు, ఏపీవో నాగేశ్వర్‌రావు, ఎంపీడీవో పాల్గొన్నారు.